..తెలంగాణ మళ్లీ ఎడారి!

మొదటిపేజీ తరువాయి...

నుంచి పెన్నా బేసిన్‌లోని చిట్టచివరి ప్రాంతాలకు సైతం కృష్ణా జలాలను తరలించేందుకు కుట్రలకు తెరలేపారు. అందులో భాగంగా పోతిరెడ్డిపాడు విస్తరణకు పూనుకున్నారు. పీఆర్పీ హెడ్‌రెగ్యులేటరీ కెపాసిటీని 44 వేల క్యూసెక్కులకు పెంచారు. కృష్ణా జలాల దోపిడీకి అక్రమంగా గాలేరు నగరి సుజల స్రవంతి, హంద్రీనీవా సుజల స్రవంతి, ముచ్చుమర్రి, మల్యాల లిఫ్ట్ ప్రాజెక్టులను చేపట్టారు. పెన్నా బేసిన్‌కు కృష్ణా జలాలను యథేచ్ఛగా మళ్లించడం ప్రారంభించారు. మళ్లించిన జలాల నిల్వకు పెన్నా బేసిన్‌లో అనేక రిజర్వాయర్లను భారీ సామర్థ్యంతో నిర్మించారు. పెన్నా బేసిన్‌లో మొత్తంగా 42 రిజర్వాయర్లను ఏర్పాటు చేయగా, ఒక్క పెన్నా నదిపైనే ఎగువ నుంచి దిగువకు రివర్‌పైనే 11 రిజర్వాయర్లు నిర్మించారు. పెన్నా బేసిన్‌లో ఇప్పటికే 350 టీఎంసీల జలాల నిల్వ సామర్థ్యమున్నది. ప్రధాన రిజర్వాయర్లకు అనుబంధంగా అనేక చిన్నపాటి రిజర్వాయర్లను కూడా నిర్మించారు. ఆయా నీటి కాలువలను చెరువులకు సైతం అనుసంధానించారు. కృష్ణాలో వరద వచ్చిందంటే చాలు పోతిరెడ్డిపాడు ద్వారా బనకచర్ల మీదుగా కృష్ణా జలాలను పెన్నాకు మళ్లించడం పరిపాటిగా మారింది. ఇప్పుడు జీబీ లింక్ ద్వారా గోదావరి జలాలను పెన్నాబేసిన్‌లోని ప్రతి బేసిన్‌కూ తరలించడమే లక్ష్యంగా ఏపీ ముందుకు సాగుతున్నది.



150 టీఎంసీలతో బొల్లాపల్లి రిజర్వాయర్

పెన్నా బేసిన్‌లో ఇప్పటికే 350 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యముండగా జీబీ లింక్ ప్రాజెక్టులో భాగంగా ఏపీ మరో భారీ రిజర్వాయర్‌ను నిర్మించేందుకు సిద్ధమైంది. పల్నాడు జిల్లాలో బొల్లాపల్లి గుట్టలను కలిపి 150 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో జలాశయాన్ని నిర్మించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ స్టడీస్ రిపోర్ట్‌ను సమర్పించేందుకు సిద్ధమైంది. పల్నాడు జిల్లాలో 15 ముంపు గ్రామాలపైనా ఇప్పటికే సర్వే చేయించింది. పెన్నా బేసిన్‌లో కాల్వల సామర్థ్యం పెంపు పనులను నిర్వహిస్తున్నది. గాలేరి నగరి, అవుకు జలాశయాల మధ్య కాలువల సామర్థ్యాలను 12,735 క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కులకు పెంచాలని ఇప్పటికే నిర్ణయించింది. బొల్లాపల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలనే కాదు, కృష్ణా జలాలనూ తరలించే అవకాశం ఉన్నది. నాగార్జునసాగర్ కుడి కాల్వనే ఓ రిజర్వాయర్‌గా మార్చి బనకచర్లకు తరలించేలా ప్లాన్ చేసింది. జీబీ లింక్ ప్రాజెక్టు 2వ దశలో ప్రకాశం బరాజ్ బొల్లాపల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలను ఆరు లిఫ్టుల ద్వారా ఎత్తిపోయనుంది. అందులో భాగంగా ప్రకాశం బరాజ్, పులిచింతల ప్రాజెక్టుకు మధ్య వైకుంఠపురం వద్ద అదనంగా ఓ బరాజ్‌ను నిర్మించాలని ఏపీ సమాలోచనలు చేస్తున్నది. అదేవిధంగా సాగర్ కుడి కాల్వను 80వ కి.మీ పాయింట్ వద్ద వెడల్పు చేసి, ఓ రిజర్వాయర్‌లా మార్చేందుకు ఎత్తుగడ వేసింది. అక్కడి వరకు ఐదు లిఫ్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి, కుడి కాల్వ పాయింట్ తర్వాత మరో లిఫ్ట్‌ను నిర్మించి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు నీటి తరలింపునకు పూనుకున్నది. గోదావరి జలాలను రాబోయే రోజుల్లో సాగర్ కుడి కాల్వకూ మళ్లించే ప్రణాళికలను అమలు చేస్తున్నది. ప్రస్తుతం బనకచర్ల వరకే 2 టీఎంసీల గోదావరి జలాలను తరలిస్తామని చెప్పున్నా, దిగువన సోమశిలకు సైతం అదనంగా ఒక టీఎంసీని తరలించే ప్రణాళికలను సైతం ఏపీ సిద్ధం చేస్తున్నది.

కృష్ణా, తుంగభద్ర జలాలూ పెన్నాకే..

తుంగభద్ర డ్యామ్ హైలెవల్ కెనాల్ పొడవు 189 కి.మీ. 105కి.మీ వరకు కర్ణాటకలో, అక్కడి నుంచి 189వ కి.మీ. వరకు ఏపీలోని అనంతపురం జిల్లా గుండా పోతుంది. ఈ కాలువ నుంచి ఆ జిల్లాలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్, పెన్నార్ అహోబిలం రిజర్వాయర్లు కూడా ఉన్నాయి. ఈ హెచ్ఎల్‌సీ ద్వారా ఏపీకి 32 టీఎంసీల జలాల కేటాయింపులు ఉన్నాయి. అవార్డులకు విరుద్ధంగా కడప- కర్నూల్ (కేసీ) కెనాల్‌కు సైతం అదనంగా దాని నుంచే జలాలను మళ్లిస్తున్నారు. కేవలం కృష్ణాకు వరదలు వచ్చిన క్రమంలో వాటిని తక్కువ సమయంలోనే తరలించి అనంతపురం జిల్లాలకు అందిస్తామని చెప్తూ ఏపీ సర్కారు ప్రతిపాదనలు చేసింది. హెచ్ఎల్‌సీ కెనాల్‌కు సమాంతరంగా మరో కాలువను తవ్వేందుకు ఏపీలోని టీడీపీ సర్కారు శరవేగంగా ముందుకు వెళ్తున్నది. కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం కేసీ కెనాల్‌కు సుంకేసుల బరాజ్ నుంచి తుంగభద్ర నదీ జలాలను మాత్రమే వాడుకోవాలి. అందుకు విరుద్ధంగా ఏపీ వ్యవహరిస్తున్నది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి అనుమతుల్లేని మల్యాల, ముచ్చుమర్రి వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి లిఫ్ట్ స్కీం పంపింగ్ స్టేషన్ 1, ముచ్చుమర్రి వద్ద కేసీ కెనాల్ లిఫ్ట్ స్కీం ద్వారా, పోతిరెడ్డిపాడు దిగువన బనకచర్ల వద్ద నాలుగు అదనపు మార్గాల ద్వారా కృష్ణా జలాలను కేసీ కెనాల్‌కు మళ్లిస్తున్నది. అంతేకాదు తుంగభద్ర డ్యామ్ కుడివైపు హై లెవెల్ కెనాల్ ద్వారా కూడా మళ్లిస్తున్నది. అందుకు కర్ణాటక కూడా అంగీకరించింది. తుంగభద్ర, కృష్ణా జలాలన్నీ ఇప్పటికే పెన్నా బేసిన్‌కు తరలిపోనుండగా, రాబోయే రోజుల్లో జీబీ లింక్ ద్వారా గోదావరి జలాలు సైతం మళ్లిపోనున్నాయి.



ఎడమవైపునా అక్రమంగా లిఫ్టులు

పోలవరం ప్రాజెక్టు కుడివైపునే కాదు ఎడమవైపునా ఏపీ అనేక అక్రమ లిఫ్టులను ఏర్పాటు చేసింది. కుడి కాలువపై పోలవరం ప్రాజెక్టులో భాగంగా ఉన్న ఆయకట్టుకు నీటిని అందించడానికి తాత్కాలికంగా పట్టిసీమ, పుష్కర లిఫ్టులను ఏర్పాటు చేస్తామని, ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన అనంతరం వాటిని తొలగిస్తామని చెప్పింది. కానీ ఆచరణలో ఆ రెండింటింతోపాటు చాగల్నాడు, తొర్రిగడ్డ, తాడిపూడి, తదితర ప్రాజెక్టులను ఏర్పాటు చేసి గోదావరి జలాలను తరలిస్తున్నది. ఇదిలా ఉంటే పోలవరం ఎడమ కాలువపైనా అక్రమంగా లిఫ్ట్ స్కీమ్‌లను ఏర్పాటు చేసింది. పురుషోత్తమపట్నం లిఫ్ట్‌ను ఇప్పటికే ఏర్పాటు చేసింది. అదేవిధంగా వెంకటనగరం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, చింతపూడి రెండో దశల ప్రాజెక్టులను కూడా చేపట్టింది. వంశధార, నాగావళితోపాటు అనేక సబ్‌బేసిన్లను అనుసంధానిస్తూ కెనాల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. వాటన్నింటికీ తోడు పోలవరం జలాశయం డెడ్ స్టోరేజీ నుంచి కూడా 18 టీఎంసీల నీటిని వాడుకునేందుకు ఏపీ ప్రభుత్వం కొత్తగా పోలవరం ఎత్తిపోతల పథకం పనులను కూడా చేపట్టడం గమనార్హం. మొత్తంగా కృష్ణా జలాల తరహాలోనే గోదావరి జలాలను సైతం చెరబట్టేందుకు ఏపీ ప్రణాళికలను అమలు చేస్తున్నది.

ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో భేటీ అయిన మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, గంగుల కమలాకర్, కాపు సంఘం నేత రజనీకాంత్ తదితరులు

యూఎస్‌లో మున్నూరుకాపు మహాసభ

ఆగస్టు 30,31 తేదీల్లో నిర్వహణ

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): గ్లోబల్ మున్నూరుకాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 30,31 తేదీల్లో అమెరికాలో మహాసభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి మున్నూరుకాపు ప్రముఖుల సమావేశం జరిగింది.సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, జాజుల సురేందర్, ప్రముఖ ఇంద్రజాలికులు సామల వేణు, సంఘం ప్రముఖులు కొండా దేవయ్య, కొత్త లక్ష్మణ్, చంద్ర జనార్ధన్,ఉసా రఘు, కొనగాల మహేశ్,రుద్ర సంతోష్, లవంగాల అనిల్, డాక్టర్ రామ సాని వెంకట శ్రీనివాసరావు (ఖతార్), శ్రీధర్ (బోట్స్‌వానా) పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్దన్, రాధామిత్ర మండలి సీనియర్ నాయకుడు అల్లుడు సాంబశివరావు, వ్యాపారవేత్త గంటాసాయి, సీనియర్ జర్నలిస్టు మేకల కల్యాణ్ చక్రవర్తి బంజారాహిల్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమకాలీన అంశాలపై వారు ఇష్టాగోష్ఠిగా చర్చించుకున్నారు.

కవ్వింపులు ఆపకపోతే సమ్మెతప్పదు

- జూన్ 2 లోపు సమస్యలను పరిష్కరించాల్సిందే
- వెల్ఫేర్ బోర్డు కమిటీల మీటింగ్స్ రద్దు చేయాలి
- ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ నియామకాలు ఆపండి
- యాజమాన్యానికి ఆర్టీసీ కార్మిక జేఏసీ హెచ్చరిక

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ యాజమాన్యం కవ్వింపు చర్యలను తక్షణం ఆపకపోతే సమ్మెకు వెళ్తామని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ స్పష్టంచేసింది. ఇంత కుముందు సమ్మెను వాయిదా వేశామని, విరమించుకోలేదని తెలిపింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను జూన్ 2లోగా అమలు చేయకపోతే సమ్మె తప్పదని, ఇందుకు ఆర్టీసీ యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ మేరకు ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్మిక సంఘాలను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం.. ఇప్పుడు ఏకపక్షంగా డిపోలు, రీజియన్లవారీగా వెల్ఫేర్ బోర్డు కమిటీల సమావేశాలు నిర్వహించడమేంటని ప్రశ్నించింది. సమావేశాలను తక్షణం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నెల 6న సచివాలయంలో జరిగిన చర్చల సందర్భంగా రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని, అందులో యూనియన్ల పునరుద్ధరణ కూడా ఉందని గుర్తుచేశారు. హామీకి విరుద్ధంగా వెల్ఫేర్ బోర్డ్ మీటింగ్స్ గురించి సర్క్యులర్ జారీచేయడం "పుండు మీద కారం చల్లినట్టు" ఉందని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అడ్డుపడేలా ఆర్టీసీ యాజమాన్యం సమావేశాలు నిర్వహిస్తున్నట్టు భావిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ సంస్థల ద్వారా ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తే సహించబోమని హెచ్చరించారు. ఆర్టీసీ సంస్థ ఎండీ ఇటువంటి సర్క్యులర్ ద్వారా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడడం సమంజసంకాదని వారు పేర్కొన్నారు.

ఔట్‌సోర్సింగ్ నియామకాలు ఆపాలి

ఆర్టీసీలోకి ప్రైవేట్ బస్సులను తీసుకురావడం, గ్యారేజ్‌లను ప్రైవేటుపరం చేయడం మానుకోవాలని, ఔట్‌సోర్సింగ్ నియామకాలు ఆపాలని కోరారు. లేకపోతే సమ్మె బాట పడుతామని జేఏసీ నేతలు చైర్మన్ ఈదురు వెంకన్న, కోవైర్మన్ హనుమంత్ ముదిరాజ్, వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, యాదగిరి హెచ్చరించారు.

ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీపై నిర్లక్ష్యం

- కేంద్రం, రాష్ట్రం దొందూ దొందే
- ఏడాదైనా పురోగతి శూన్యం
- భూములున్నా పట్టింపులేదు
- ప్రాజెక్టు పూర్తయితే 1.74 లక్షల ఉద్యోగాలు

హైదరాబాద్, మే 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పారిశ్రామిక రంగం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి దొందూ దొందే అన్నట్టుగా తయారైంది. ఎవరికివారు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో తెలంగాణలో పారిశ్రామిక రంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. నిధుల లేమితో రాష్ట్ర ప్రభుత్వం నూతన పారిశ్రామికవాడల ఏర్పాటును పూర్తిగా విస్మరించగా.. కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ వ్యవహారమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. తయారీ రంగంలో దేశాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్ఐసీడీపీ)ను చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ ఇండస్ట్రియల్ కారిడార్ల పరిధిలో ఉండే నగరాలను దశలవారీగా ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో నిరుడు ఆగస్టులో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలను మంజూరు చేశారు. ఆ జాబితాలో జహీరాబాద్‌కు చోటు కల్పించారు. దీంతో కేంద్రం ఇప్పటివరకు మొత్తం 20 ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలను మంజూరు చేసినట్టయింది. వాటిలో ధోలేరా స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (గుజరాత్), ఔరంగాబాద్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ లిమిటెడ్ (మహారాష్ట్ర), గ్రేటర్ నోయిడా ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ (ఉత్తరప్రదేశ్), విక్రమ్ ఉద్యోగ్‌పురి ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ (మధ్యప్రదేశ్) ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ 4 గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీలు 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల సామర్థ్యాన్ని కలిగివున్నాయి.

1.74 లక్షల ఉద్యోగాలు వచ్చే ప్రాజెక్టుపై నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం భూములను సమకూర్చితే స్మార్ట్‌సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది. తద్వారా నివాస ప్రాంతాలు, కంపెనీల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా మం జూరైన జహీరాబాద్ స్మార్ట్‌సిటీని మొదటి దశలో రూ.2,361 కోట్లతో 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తద్వారా రూ.10 వేల కోట్ల పెట్టుబడులతోపాటు 1,74,000 ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఆటోమొబైల్, ట్రాన్స్‌పోర్ట్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్‌తోపాటు మెటల్స్, నాన్-మెటాలిక్ మినరల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర పరిశ్రమలకు అనువుగా ఉండేలా జహీరాబాద్ స్మార్ట్‌సిటీని సిద్ధం చేయాలని నిర్ణయించారు.

కేసీఆర్ హయాంలోనే 8 వేల ఎకరాల సేకరణ

నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్-జహీరాబాద్ (నిమ్జ్) కోసం జహీరాబాద్, న్యాలకల్, జరాసంఘం మండలాల పరిధిలో 13,500 ఎకరాలు సేకరించాలని నిర్ణయించగా.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దాదాపు 8 వేల ఎకరాల భూసేకరణ పూర్తయింది. దీనికి పర్యావరణ అనుమతులు కూడా లభ్యమయ్యాయి. కోర్టు కేసుల వల్ల కొన్ని చోట్ల భూసేకరణలో ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వాటిని పరిష్కరించాల్సి ఉన్నది. కాగా, స్మార్ట్‌సిటీకి అవసరమైన 3,000 ఎకరాలకుపైగా భూములు ఇప్పటికే సిద్ధంగా ఉన్నట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి. ప్రస్తుతం కేంద్రం మంజూరు చేసిన ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీ కూడా ఈ ప్రాంతంలోనే ఉన్నది. సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్, జరాసంఘం మండలాల్లోని 17 గ్రామాల్లో ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్‌సిటీని నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టును మొత్తం రెండు దశల్లో 12,500 ఎకరాలకు విస్తరించాలన్న ప్రతిపాదనలున్నాయి. ఎన్ఐసీడీఐటీ ప్రేమ్‌వర్క్‌లో భాగంగా మొదటి దశలో 3,245 ఎకరాల్లో పనులు ప్రారంభించాల్సి ఉన్నది. అన్ని అనుకూలతలు, భూములు సిద్ధంగా ఉన్నా, కంపెనీల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాజెక్టు ముందుకు సాగడంలేదు.

బనకచర్లపై చలో ఢిల్లీ

మొదటిపేజీ తరువాయి...

పెద్దఎత్తున ప్రజా పోరాటానికి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రాజెక్టును నిలువరించాలని, లేదంటే ఢిల్లీలో సీడబ్ల్యూసీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆదివారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించుకుపోయేందుకు ఏపీ కుట్ర చేస్తున్నదని, తద్వారా తెలంగాణకు తీవ్ర నష్టం కలగబోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణ చెల్లించుకుంటూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ పాత ప్రాజెక్టులు పూర్తి చేస్తామంటే అడ్డుకున్న ఏపీ.. ఒక్క అనుమతి కూడా లేకున్నా నిబంధనలు బుల్డోజ్ చేస్తూ, కేంద్రం జుట్టు తన చేతిలో ఉన్నదని రాత్రికి రాత్రి పనులు చేపడుతున్నదని విమర్శించారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాణిక్‌రావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్

> కిషన్‌రెడ్డీజీ.. ఆల్‌పార్టీ డెలిగేషన్‌ను మోదీ దగ్గరకు తీసుకెళ్లండి. పదవిలో ఉండటం ముఖ్యం కాదు, ప్రజా ప్రయోజనాలు ముఖ్యం. పదవిలో ఉండే అర్హత మీకు లేదు. జీరో పర్మిషన్ ప్రాజెక్టులకు అనుమతులు ఎలా ఇస్తారు? -హరీశ్‌రావు

> చంద్రబాబు ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు అనేక లేఖలు రాశారు. 2018లో కేంద్ర జలవనరుల శాఖకు, అపెక్స్ కౌన్సిల్ లేఖ రాశారు. సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా, విభజన చట్టం ఉల్లంఘిస్తూ కాళేశ్వరం కడుతున్నారని అడ్డుకోవాలని పేర్కొన్నారు. భక్త రామదాసు లిఫ్టు ఆపేందుకు లేఖ రాశారు. పాలమూరు సహా 20, 30 ప్రాజెక్టులు అడ్డుకోవాలని లేఖలు రాశారు. చివరికి గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసులు వేశారు. -హరీశ్

బాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నరా?

బనకచర్ల ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాలను తరలింపు కుట్ర ప్లాన్ ప్రకారమే జరుగుతున్నదని తెలిసినా సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడంలేదని, గురుదక్షిణ చెల్లించుకుంటూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఇదే చంద్రబాబు ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకునేందుకు అనేక లేఖలు రాశారు. 2018లో కేంద్ర జలవనరుల శాఖకు, అపెక్స్ కౌన్సిల్‌కు లేఖలు రాశారు. సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా, విభజన చట్టం ఉల్లంఘిస్తూ కాళేశ్వరం కడుతున్నారని అడ్డుకోవాలని కోరారు. కాళేశ్వరం కొత్తది కాదు, ప్రాణహితకు కొనసాగింపు అని వాస్తవం చెప్పి కేంద్రం అనుమతి సాధించాం. భక్త రామదాసు లిఫ్టు ఆపేందుకూ లేఖ రాశారు. పాలమూరు సహా 20, 30 ప్రాజెక్టుల్ని అడ్డుకోవాలని లేఖలు రాశారు. చివరికి గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసులు వేశారు' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా చం ద్రబాబు రాసిన లేఖలను మీడియాకు చూపించారు.

అనుమతి లేకుండా కడుతున్నరు

విభజన చట్టం ప్రకారం గోదావరి, కృష్ణా నదులపై ప్రాజెక్టులు కడితే కేఆర్ఎంబీ లేదా జీఆర్ఎంబీతోపాటు అపెక్స్ కౌన్సిల్, సీడబ్ల్యూసీ, పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోవాల్సిందేనని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 'గోదావరి బనకచర్ల ప్రాజెక్టు కొత్త ప్రాజెక్టు కాదా? విభజన చట్టం ప్రకారం, కేఆర్ఎంబీ లేదా జీఆర్ఎంబీ అనుమతి తీసుకోవాలి. ఆయా పరీవాహక రాష్ట్రాలు ఒప్పుకోవాలి. అపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందాలి, సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి, ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ తీసుకోవాలి. ఇవేవీ లేకుండానే కొత్త ప్రాజెక్టులు కడుతున్నారు' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

బహిష్కరిస్తామని ముందే వెళ్లిన రేవంత్

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి రూపాయి కూడా కేటాయించలేదని, నీతి ఆయోగ్ సమావేశాన్ని వ్యతిరేకిస్తామని అసెంబ్లీ చెప్పిన రేవంత్‌రెడ్డి.. అందరికంటే ముందే ఎందుకు వెళ్లారని హరీశ్‌రావు ప్రశ్నించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌కు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని ప్రధానితో మాట్లాడతారకున్నామని, కానీ ఏమీ మాట్లాడలేదని మండిపడ్డారు. 'అసలు కుట్ర ఏమిటంటే, గోదావరి మీద ట్రిబ్యునల్ వేయాలని ఏపీ ఇప్పటికే ఫిర్యాదు చేసింది. గోదావరి ట్రిబ్యునల్ వచ్చే లోపే బనకచర్ల నిర్మించి, ప్రజాధనం ఖర్చు అయింది కాబట్టి, నీళ్లు కేటాయించాలని చెప్పి, 200 టీఎంసీలు తీసుకొనే కుట్ర. ఇదంతా ఒక పథకం ప్రకారం జరుగుతున్నది' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

తెలంగాణకు బీజేపీ ద్రోహం

తెలంగాణ రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ సర్కారు తీరని ద్రోహం చేస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కాళేశ్వరం కోసం మేం ఆర్ఈసీ, పీఎఫ్‌సీ నుంచి రుణాలు తెచ్చినం. ఎఫ్ఆర్‌బీఎం కంటే అదనంగా ఉన్నదని కేంద్రం రికవరీ పెట్టింది. ఏపీకి మాత్రం ఎఫ్ఆర్‌బీఎం పరిధి దాటి రుణాలు తెచ్చుకొనే అవకాశం ఇచ్చింది. తెలంగాణ పట్ల బీజేపీకి ఎందుకింత కక్ష. సవతి తల్లి ప్రేమ? తెలంగాణ భారతదేశంలో భాగంగా కాదా? పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చారు. బాగానే ఉన్నది. కానీ, మా కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులకు ఎందుకు జాతీయ హోదా ఇవ్వరు? పోలవరానికి రూ. 80 వేల కోట్లు, బనకచర్లకు రూ.80వేల కోట్లు.. అంటే లక్షా 60 వేల కోట్లు ఏపీకి ఇస్తరు. ఇందులో ఒక్క